క్లుప్తంగా

నగర పంచాయతీ కార్మికుల ధర్నా

తిరువూరు: తమ సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరుతూ తిరువూరు నగర పంచాయతీ కార్మికులు గురువారం ధర్నా నిర్వహించారు. సీఐటీయూ అనుబంధ ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో నగర పంచాయతీ కార్యాలయం ఎదుట ఆందోళన జరిపారు. సీఐటీయూ మండల కార్యదర్శి బి. వెంకటేశ్వరరావు మాట్లాడుతూ కార్మికులకు దుస్తుల అలవెన్సు ఇవ్వాలని, మూడు నెలల పెండింగ్ హెల్త్ అలవెన్సు మంజూరు చేయాలని, పుష్ కార్టులకు మరమ్మతు చేయించి కార్మికులకు బ్లౌజులు, మాస్కులు ప్రతి నెలా ఐదో తేదీలోగా ఇవ్వాలని కోరారు. తమ సమస్యలు పరిష్కరించకపోతే మే 10 నుంచి నిరవధిక సమ్మె చేపడతామని నగర పంచాయతీ కమిషనర్ లోవరాజుకు మెమోరాండం సమర్పించారు.

స్టేట్ ర్యాంకర్ హరిణికి సన్మానం



మైలవరం: ఇటీవల వెలువడిన ఇంటర్ మీడియెట్ ఫలితాల్లో మైలవరం ప్రభుత్వ బాలికల హైస్కూల్ ప్లస్ టులో స్టేట్ ఫస్ట్ ర్యాంక్ సాధించిన వెదురుబీడెం విద్యార్థిని భూక్యా హరిణి, ఆమె తల్లిదండ్రులను మదర్ థెరిస్సా చారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షురాలు కోయ సుధ తన కార్యాలయంలో గురువారం శాలువాతో సత్కరించి అభినందించారు. సుధ మాట్లాడుతూ విద్యార్థిని హరిణిని ఆదర్శంగా తీసుకుని విద్యార్థులు మంచి ఫలితాలు సాధించాలని సూచించారు. గరల్స్ హైస్కూల్ విద్యా కమిటీ చైర్మన్ మైక్ బాబూరావు, ట్రస్ట్ సభ్యులు హైమ, దీప్తి, ఉమ తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

తిరువూరు: స్థానిక జెడ్పీ బాలికోన్నత పాఠశాలలోని జూనియర్ కళాశాల విభాగంలో ప్రథమ ఇంటర్మీడియెట్‌లో ప్రవేశానికి బాలికలు దరఖాస్తు చేసుకోవాలని ప్రధానోపాధ్యాయుడు పీఎస్ఎన్ రాజు పేర్కొన్నారు. పదో తరగతి పబ్లిక్ పరీక్షల ఫలితాలు త్వరలో విడుదల కానున్నందున విద్యార్థులు ముందుగా తమ కళాశాలలో దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. గురువారం పలువురు విద్యార్థినులకు ప్రవేశాలు కల్పించామని చెప్పారు.

పదోన్నతులు కల్పించాలని ఆర్టీసీ ఉద్యోగుల ఆందోళన



ఇబ్రహీంపట్నం: ఆర్టీసీ ఉద్యోగులకు పదోన్నతులు కల్పించాలని నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఇబ్రహీంపట్నం ఆర్టీసీ డిపో గేటు వద్ద గురువారం ఆందోళన చేపట్టారు. ప్లకార్డులు చేతబట్టి దీర్ఘకాలిక సమస్యలు పరిష్కరించాలని నినాదాలు చేశారు. డిపో కార్యదర్శి పసుపులేటి శ్రీనివాసరావు మాట్లాడుతూ 2019 సర్క్యులర్ తక్షణం అమలు చేయాలని, ప్రస్తుత వైద్య విధానానికి స్వస్తి చెప్పి పూర్వపు వైద్య విధానాన్ని అమలు చేయాలని, మహిళా ఉద్యోగులకు చైల్డ్ కేర్ లీవ్‌లు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. అనారోగ్యానికి గురైన ఉద్యోగులకు పూర్తి స్థాయి వేతనం అమలు చేయాలని కోరారు. అసోసియేషన్ కోశాధికారి వి.ఆంజనేయులు, వర్కింగ్ ప్రెసిడెంట్ జె.ఆంజనేయులు, సహాయ కార్యదర్శి శేఖర్, ఉపాధ్యక్షుడు బీఎస్ రావు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి వర్డ్ పవర్ పోటీల్లో విద్యార్థుల ప్రతిభ



మైలవరం: రాష్ట్ర స్థాయిలో జరిగిన వర్డ్ పవర్ పోటీల్లో మైలవరం మండలం కనిమెర్ల ఎంపీపీ పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబర్చి విజేతలుగా నిలిచారని ఎంఈఓ ఎల్. బాలు గురువారం తెలిపారు. విజయవాడలో గత నెలలో జరిగిన రాష్ట్ర స్థాయి వర్డ్ పవర్ చాంపియన్ షిప్ పోటీల్లో కనిమెర్ల ఎంపీపీ పాఠశాల విద్యార్థులు బాణావత్ రేవంత్ కుమార్ (4వ తరగతి), బాణావత్ సింధు (రెండవ తరగతి, స్టేట్ ఫస్ట్) రాష్ట్ర స్థాయి విజేతలుగా నిలిచారన్నారు. ఈ నెల 23న ముంబాయిలో జరుగనున్న జాతీయ స్థాయి పోటీల్లో వీరు పాల్గొంటారన్నారు. విద్యార్థులను ఎంఈఓ బాలు, సర్వశిక్షా అభియాన్ ఏఎంఓ (అకడమిక్ మానిటరింగ్ ఆఫీసర్) అశోక్, అసిస్టెంట్ ఏఎంఓ శిరీషా, ఉపాధ్యాయిని విజయలక్ష్మి అభినందించారు.

సారా నిందితుడికి రిమాండ్

ముసునూరు: చిల్లబోయినపల్లిలో మిడత శ్రీనుకు చెందిన సారా బట్టీపై నూజివీడు ఎక్సైజ్ ఎస్ఐలు ఈశ్వరరావు, ప్రసాద్ ఆధ్వర్యంలో ఇటీవల దాడి చేశారు. 20 లీటర్ల సారాను స్వాధీనం చేసుకుని, 400 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేశారు. బట్టీ యజమానిపై కేసు నమోదు చేశారు. నిందితుడిని గురువారం అరెస్ట్ చేసి నూజివీడు కోర్టుకు తరలించగా రిమాండ్ విధించారని సీఐ మస్తానయ్య తెలిపారు.

అద్దెలను తలపిస్తున్న ఆశీలు

- నెలకు రూ. 3వేల వరకు వసూలు
- దోపిడీకి గురవుతున్న చిరు వ్యాపారులు
- గతంలో ఆశీలు వసూలు చేయబోమని టీడీపీ కౌన్సిలర్ల ప్రగల్భాలు



కొండపల్లి మున్సిపాల్టీలో పండ్లు అమ్ముకుంటున్న చిరు వ్యాపారులు

కొండపల్లి(ఇబ్రహీంపట్నం): కొండపల్లి మున్సిపాల్టీలో ఆశీల పేరుతో చిరు వ్యాపారులు దోపిడీకి గురవుతున్నారు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ఆశీల వసూలును వ్యతిరేకించిన టీడీపీ కౌన్సిలర్లు, కూటమి ప్రభుత్వంలో రూ.11.30 లక్షలకు టెండర్ దక్కించుకుని ఏడాదికి లక్షలాది రూపాయల వసూలుకు ప్రణాళిక రచించారనే వాదనలు ఉన్నాయి. నాయకులతో పాటు కార్యాలయ సిబ్బందికి కూడా వాటాలు ఉన్నాయనే ప్రచారం జరుగుతోంది. సుమారు 300 మంది వరకు తోపుడు బండ్లు, సైకిళ్లపై పండ్లు, తదితర వస్తువులు అమ్ముకుని జీవిస్తున్న వారు ప్రతి రోజు ఆశీలు చెల్లించేందుకు ఇబ్బందులు పడుతున్నారు. గతంలో అప్పటి, ఇప్పటి ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణ ప్రసాద్ చిరువ్యాపారుల ఏడాది ఆశీలు సుమారు రూ.7 లక్షలు తానే భరిస్తానని ప్రకటించారు. ఆ తర్వాత నగదు చెల్లించకుండా ఆశీల ప్రక్రియను రద్దు చేయించారు.

టీడీపీ కౌన్సిలర్ల ప్రగల్భాలు

గత ప్రభుత్వంలో ఆశీల వసూలు రద్దు చేయాలని టీడీపీ కౌన్సిలర్లు స్పందన కార్యక్రమంలో ఫిర్యాదు చేశారు. ర్యాలీలు, ధర్నాలు నిర్వహించారు. చిరు వ్యాపారుల పొట్టకొట్టొద్దని, దిక్కుమాలిన పని మానుకోవాలని ప్రగల్భాలు పలికారు. అప్పట్లో ఆశీల వసూలు నిలిపివేసే వరకు పోరాటాలు చేశారు. గత నెలలో నిర్వహించిన వేలంలో 4వ వార్డు టీడీపీ కౌన్సిలర్ భర్త బాడిశ నాగరాజు రూ.11.30 లక్షలతో ఏడాది కాలానికి వేలం దక్కించుకున్నాడు. వేలం ముగిసిన వెంటనే గత ప్రభుత్వంలో మాదిరిగా చిరు వ్యాపారుల నుంచి ఆశీలు వసూలు చేయమని మీడియా ముఖంగా ప్రగల్భాలు పలికారు. ఇప్పుడు ఆ ప్రగల్భాలు గాలికొదిలేసి చిరువ్యాపారుల ద్వారా వస్తున్న రోజు వారీ సంపాదనలో మునిగితేలుతున్నారు.

తోపుడు బండ్లకు రూ. 100 వసూలు

కొండపల్లి మున్సిపాల్టీ పరిధిలో సైకిల్ వ్యాపారికి రూ.50, తోపుడు బండ్ల వద్ద రూ.100 చొప్పున ఆశీలు వసూలు చేయడంపై వ్యాపారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ లెక్కన నెలకు రూ.1,500 నుంచి రూ.3 వేల వరకు వ్యాపారులు చెల్లించాల్సి వస్తోంది. ఆశీలుకు చెల్లించే రూ.3 వేలతో కొద్దిపాటి దుకాణానికి అద్దె చెల్లించవచ్చని వారు చెబుతున్నారు. ఆశీలు అంటే రూ.2 నుంచి రూ.5 వరకు ఉంటుందని భావించామని. వీరు రూ.50, రూ.100 వసూలు చేయడం ఏమిటని ప్రశ్నిస్తున్నారు. తోపుడు బండ్లు అద్దెకు తీసుకుని రోడ్ల పక్కన వ్యాపారాలు చేయడం వలన ఓవైపు పోలీసుల తాకిడి, మరో వైపు ఆశీల వసూలుతో ఆర్థికంగా నష్ట పోతున్నారు. చిరు వ్యాపారుల నుంచి ఆశీల వసూలు రద్దు చేయాలని కోరుతున్నారు.

హైవే పక్కన ప్రత్యామ్నాయం చూపాలి



పూర్వం రింగ్ సెంటర్ చిరు వ్యాపారులకు నిలయంగా ఉండేది. కూటమి ప్రభుత్వ పాలనలో రోడ్డుపక్కన వ్యాపారం చేయకుండా తరిమేస్తున్నారు. ట్రాఫిక్ ఇబ్బందులను సాకుగా చూపుతున్నారు. ప్రభుత్వ స్థలాల్లో కాంప్లెక్స్ కట్టి చిరు వ్యాపారులకు ప్రత్యామ్నాయం చూపించాలి.

– ఎ.విఠల్‌రావు, చిరు వ్యాపారుల సంఘం గౌరవాధ్యక్షుడు

ఆశీలు రద్దు చేయాలి



చిరు వ్యాపారులు ఏరోజు కారోజు సంపాదనతో కుటుంబాలు పోషించుకుంటారు. వివిధ రకాల వ్యాపారాలపై రోజుకు రూ.300 నుంచి రూ.400 సంపాదిస్తారు. వాటిలో పెట్టుబడి పోగా రూ.100 వరకు ఆశీలు చెల్లిస్తే వారి కుటుంబాల మనుగడ ప్రశ్నార్థకం అవుతుంది. చిరు వ్యాపారుల నుంచి ఆశీల వసూలు రద్దు చేయాలి.

–ఎం.మహేష్, సీఐటీయూ మండల కార్యదర్శి, ఇబ్రహీంపట్నం

కౌన్సిల్ సమావేశంలో చైర్‌పర్సన్‌కు అస్వస్థత

తిరువూరు: తిరువూరు నగర పంచాయతీ కౌన్సిల్ అత్యవసర సమావేశం గురువారం చైర్‌పర్సన్ గత్తం కస్తూరిబాయి అధ్యక్షతన ప్రారంభమైన కొద్దిసేపటికే అర్ధంతరంగా నిలిచిపోయింది. నాలుగు అంశాలతో కూడిన అజెండాను సమావేశంలో ప్రవేశపెట్టి చర్చ ప్రారంభించిన కొద్దిసేపటికే చైర్‌పర్సన్ కస్తూరిబాయి పోడియం నుంచి దిగి బయటికి వెళ్లిపోయారు. అనారోగ్య కారణాలతో సమావేశానికి ముందు ఆస్పత్రికి వెళ్లిన చైర్‌పర్సన్ వైద్యుల సలహా మేరకు కౌన్సిల్ చర్చకు విచ్చేశారు. తన రాజీనామాను కౌన్సిల్‌లో ఆమోదానికి అజెండాలో పొందుపరిచి సభ్యులు తీర్మానించే సమయంలో ఆమె వెళ్లిపోవడంతో ప్రతిపక్ష సభ్యులు విమర్శలకు దిగారు. అయితే మరో రెండు రోజుల్లో అత్యవసర సమావేశం ఏర్పాటు చేసి చైర్‌పర్సన్ రాజీనామాను కౌన్సిల్‌లో ఆమోదించనున్నట్లు వైఎస్సార్ సీపీ కౌన్సిలర్లు తెలిపారు.

ప్రభుత్వ స్థలాల ఆక్రమణపై ఆందోళన

తిరువూరు: తిరువూరులో ప్రభుత్వ ఆస్తులు అన్యాక్రాంతం అవుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని సామాజిక కార్యకర్త ముదిగొండ దుర్గాప్రసాద్ ఆరోపించారు. గతంలో ఆర్ అండ్ బీ సెక్షన్ కార్యాలయ ఆవరణలోని అన్న క్యాంటీన్‌కు బ్రిటీష్ కాలం నుంచి ఉన్న ప్రహరీ పడగొట్టి స్థలాన్ని ఆక్రమించేందుకు రెండు రోజులుగా ప్రైవేటు వ్యక్తులు ప్రయత్నిస్తున్నారని చెప్పారు. అన్న క్యాంటీన్ ఆవరణను ఆక్రమించి ప్రహరీ నిర్మిస్తున్న ప్రైవేటు వ్యక్తులను పనులు ఆపాలని మున్సిపల్ అధికారులు హెచ్చరించినా ఫలితం లేదన్నారు. రెవెన్యూ డివిజనల్ అధికారి కార్యాలయం ఉన్నప్పటికీ తిరువూరులో రెవెన్యూ స్థలాలకు రక్షణ కల్పించలేకపోతున్నారని, అధికారులు ఇకనైనా స్పందించకపోతే ఆందోళనకు దిగుతామని ప్రసాద్ హెచ్చరించారు.

ధాన్యం కొనుగోళ్లలో అధికారుల నిర్లక్ష్యం

- రైతుల ఇబ్బందులపై సర్పంచ్‌ల ఆవేదన
- గంపలగూడెం ఎంపీపీ సమావేశంలో చర్చ



మాట్లాడుతున్న ఎమ్మెల్యే శ్రీనివాసరావు

తిరువూరు: ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లో రబీ ధాన్యం విక్రయించేందుకు రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని గంపలగూడెం మండలంలోని ప్రజాప్రతినిధులు మండల పరిషత్ సర్వసభ్య సమావేశంలో ఆవేదన వ్యక్తం చేశారు. గురువారం ఎంపీపీ గోగులమూడి శ్రీలక్ష్మి అధ్యక్షతన మండల పరిషత్ సమావేశం జరిగింది. తిరువూరు ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఎంపీటీసీ సభ్యుడు తమ్మారపు శంకర్, అమ్మిరెడ్డిగూడెం సర్పంచి భరద్వాజ రైతుల సమస్యలను సమావేశం దృష్టికి తీసుకువచ్చారు. ధాన్యం కొనుగోలులో పలు అవకతవకలు జరుగుతున్నాయని, కొనుగోలు కేంద్రాల్లో అధికారులు, సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. 100 కిలోల బస్తాకు వివిధ కారణాలతో తరుగు తీస్తుండటంతో ప్రతి బస్తాకు రైతు రూ.325 నష్టపోతున్నాడని వారు పేర్కొన్నారు. రైతులు నేరుగా మిల్లర్లతో మాట్లాడుకుని ధాన్యం అమ్ముకోవాలని వ్యవసాయాధికారి సైతం చెబుతున్నారని, మార్కెటింగ్ అధికారులు కొనుగోలు కేంద్రాల్లో సదుపాయాలు కల్పించలేదని వాపోయారు. రైతులకు ఇబ్బంది లేకుండా చూడాలని కోరారు. గంపలగూడెం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఈ ఏడాది ఇంటర్మీడియెట్ ఫలితాల్లో కేవలం 45 శాతం విద్యార్థులే ఉత్తీర్ణులయ్యారని, ఫెయిలైన విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ ఇచ్చి విద్యా సంవత్సరం వృథా కాకుండా చూడాలని ఎమ్మెల్యే శ్రీనివాసరావు సూచించారు. తహసీల్దారు రాజకుమారి, ఎంపీడీఓ నాగేశ్వరరావు, జెడ్పీటీసీ శామ్యూల్, అధికారులు పాల్గొన్నారు.

దేవినేని నెహ్రూకు నివాళి



జూపూడిలో మహిళలకు చీరలు పంపిణీ చేస్తున్న పండు తదితరులు

జూపూడి(ఇబ్రహీంపట్నం): మాజీ మంత్రి దేవినేని రాజశేఖర్ (నెహ్రూ) వర్ధంతి కార్యక్రమం వైఎస్సార్ సీపీ జిల్లా ఐటీ వింగ్ అధ్యక్షుడు పచ్చిగోళ్ల పండు ఆధ్వర్యంలో జూపూడిలో గురువారం నిర్వహించారు. నెహ్రూ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కేక్ కట్‌చేసి స్వీట్లు పంచారు. పండు మాట్లాడుతూ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో సాంకేతిక విద్యా శాఖ మంత్రిగా విద్యారంగం అభివృద్ధికి నెహ్రూ విశేష కృషి చేశారన్నారు. ఈ సందర్భంగా పలువురు మహిళలకు చీరలు పంపిణీ చేశారు. ఏబీసీ సర్వీస్ సొసైటీ సభ్యులు, నెహ్రూ అభిమాన సంఘం నాయకులు పాల్గొన్నారు.

● **తిరువూరు:** మాజీ మంత్రి దేవినేని నెహ్రూ వర్ధంతి సందర్భంగా తిరువూరులో వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో గురువారం సేవా కార్యక్రమాలు నిర్వహించారు. పరిపూర్ణ చారిటబుల్ ట్రస్టులో చిన్నారులకు నెహ్రూ అభిమాని అత్తునూరి శివారెడ్డి వితరణ ఇచ్చిన భోజనం ప్లేట్లు, గ్లాసులను వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి స్వామిదాసు పంపిణీ చేశారు. పార్టీ నాయకులు కలకొండ రవికుమార్, యరమల రామచంద్రారెడ్డి, వెలుగోటి ఆదినారాయణ, కాలసాని గోపాల నాగేశ్వరరావు, తిరువూరు మండల అధ్యక్షుడు తాళ్లూరి నవీన్, నగర పంచాయతీ కౌన్సిలర్లు పరసా శ్రీనివాసరావు, ఏరువ ప్రకాష్‌రెడ్డి, తంగిరాల వెంకటరెడ్డి, చారిటబుల్ ట్రస్టు నిర్వాహకుడు సిరికొండ నాగేశ్వరరావు పాల్గొన్నారు.

20, 21న రజక వృత్తిదారుల రాష్ట్ర మహాసభలు

ఇబ్రహీంపట్నం: ఆంధ్రప్రదేశ్ రజక వృత్తిదారుల సంఘం ఏడో రాష్ట్ర మహా సభలు ఈనెల 20, 21 తేదీల్లో ఇబ్రహీంపట్నంలో నిర్వహిస్తామని ఆ సంఘం జిల్లా ప్రచార కార్యదర్శి ఈదర రామకృష్ణ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 20న మధ్యాహ్నం కొండపల్లి పోస్టాఫీసు నుంచి భారీ ప్రదర్శన జరుగుతుందని చెప్పారు. సాయంత్రం బీకాలనీ ఆడిటోరియం వద్ద బహిరంగ సభ ఉంటుందన్నారు. 21న ఇబ్రహీంపట్నం ఎంవీఆర్ కల్యాణ మండపంలో ప్రతినిధుల సభ జరుగుతుందని చెప్పారు.

ఎస్సీ కార్పొరేషన్ రుణాలకు దరఖాస్తులు

ఆగిరిపల్లి: ఎస్సీ కార్పొరేషన్ రుణాల కోసం అర్హత ఉన్న లబ్ధిదారులు దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీఓ ఆనంద్ బాబు గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆధార్ కార్డు, కులం, ఆదాయ, డేట్ ఆఫ్ బర్త్ సర్టిఫికెట్లు, రైస్ కార్డు, ఫొటోలు, ఆధార్ లింకైన ఫోన్ నంబర్‌తో ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని ఆయన సూచించారు.

● అల్లుకుపోయిన నిర్లక్ష్యం



మూలపాడు పంట పొలాల్లో ట్రాన్స్‌ఫార్మర్‌కు అల్లుకుపోయిన పిచ్చిమొక్కల తీగలు



కొటికలపూడిలో విద్యుత్ స్తంభాలకు అల్లుకుపోయిన పిచ్చిమొక్కల తీగలు

ఇబ్రహీంపట్నం మండల పరిధిలోని పొలాల్లో విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లు ప్రమాదకరంగా మారాయి. వీటి చుట్టూ ఉన్న పిచ్చి మొక్కల తీగలు ఏపుగా పెరిగి అల్లుకుపోయాయి. పిచ్చి మొక్కలకు విద్యుత్ సరఫరా అయితే వ్యవసాయ పనుల్లో నిమగ్నమయ్యే రైతులు విద్యుత్ షాక్‌కు గురయ్యే ప్రమాదం పొంచి ఉంది. విద్యుత్ షార్ట్ సర్క్యూట్ అయ్యే అవకాశం ఉంది. గ్రామ స్థాయిలో విద్యుత్ హెల్పర్లకు సమస్య తెలియజేసినా స్పందించడం లేదని రైతులు ఆరోపిస్తున్నారు. అధికారులు స్పందించాలని కోరుతున్నారు. – ఇబ్రహీంపట్నం

ఇన్‌చార్జ్ ఎంఈఓ-2గా వీరాస్వామి

ఇబ్రహీంపట్నం: ఇన్‌చార్జి ఎంఈఓగా జి.కొండూరు మండలానికి చెందిన ఎం.వీరాస్వామిని నియమిస్తూ జిల్లా విద్యాశాఖాధికారి సుబ్బారావు గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. ఇప్పటి వరకు ఇక్కడ పనిచేసిన పి.రత్నశ్యాంబాబు మార్చి 31న పదవీ విరమణ చేశారు. అప్పటి నుంచి ఖాళీగా ఉన్న ఎంఈఓ-2 పోస్టు నియామకానికి కాకినాడ స్కూల్ ఎడ్యుకేషన్ రీజనల్ డైరెక్టర్ జి.నాగమణి ఆదేశాల మేరకు డీఈఓ సుబ్బారావు నియామక ఉత్తర్వులు అందజేశారు.

ధాన్యం కొనుగోలు కేంద్రం పరిశీలన



విస్సన్నపేట: చంద్రుపట్ల, పుట్రేల గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను తిరువూరు ఆర్డీఓ మాధురి గురువారం పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ రైతులకు ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని సిబ్బందికి సూచించారు. లక్ష్యాల మేరకు ధాన్యం సేకరించాలని ఆదేశించారు. తహసీల్దార్ లక్ష్మీ కల్యాణి పాల్గొన్నారు.

రేపటి నుంచి విగ్రహ ప్రతిష్ఠ వార్షికోత్సవం

మైలవరం: మైలవరంలోని షిర్డీ సాయిబాబా మందిరం విగ్రహ ప్రతిష్ఠ వార్షికోత్సవం ఈ నెల 19 నుంచి 23 వరకు నిర్వహిస్తామని ఆలయ కమిటీ గురువారం తెలిపింది. 19న వినాయకుని గుడి నుంచి నగర సంకీర్తన, 20న 108 సార్లు హనుమాన్ చాలీసా పారాయణ, 21న అనఘా వ్రతాలు, గ్రామోత్సవం, 22న సాయి సత్య వ్రతాలు, ప్రవచనాలు, మహా అన్నప్రసాదం, 23న ఉదయం 8 గంటలకు సాయి హోమం, పూర్ణాహుతి జరుగుతాయని వివరించారు.

బీమా చెక్కు అందజేత



ముసునూరు: కాట్రేనిపాడుకు చెందిన నంబూరి రమేష్ భార్య సుబ్బలక్ష్మి గోపవరం ఎస్‌బీఐ బ్రాంచ్‌లో ప్రధాన మంత్రి జీవన్ జ్యోతి బీమా యోజనకు గతంలో రూ.436 జమ చేశారు. ఆమె గత ఏడాది సెప్టెంబర్‌లో మృతి చెందారు. ఆమె మరణానంతరం మంజూరైన బీమా యోజన రూ.2 లక్షల విలువైన చెక్కును గురువారం కుటుంబ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో గోపవరం ఎస్‌బీఐ మేనేజర్ రాంబాబు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలకు దాతల వితరణ



తిరువూరు: స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థుల సైకిల్ షెడ్, సమావేశపు హాలు నిర్మాణానికి పలువురు దాతలు గురువారం విరాళాలు అందజేశారు. భారతీయ స్టేట్ బ్యాంకు ఏజీఎం గురజాడ శ్రీరామ్ రూ.25 వేలు తిరువూరు బ్రాంచి మేనేజరు రవికుమార్ ద్వారా అందజేశారు. ఆడిటర్ కారుమంచి రామకృష్ణ రూ.10 వేలు, మునుకుళ్ల జెడ్పీ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు బి. వీరభద్రరావు రూ.5 వేలు, పూర్వ విద్యార్థి సంకా రాంబాబు రూ.5 వేలు, చిట్టేల ఎంపీయూపీ స్కూల్ ప్రధానోపాధ్యాయుడు పీఎస్ ప్రసాద్ రూ.2 వేలు, ఉపాధ్యాయుడు మంచికంటి వెంకటేశ్వరరావు రూ.వెయ్యి విరాళాన్ని ప్రధానోపాధ్యాయిని శ్రీలక్ష్మి, ఉపాధ్యాయుడు శంకరరావులకు అందజేశారు.

21న మండల పరిషత్ సమావేశం

ఆగిరిపల్లి: ఆగిరిపల్లి మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఎంపీపీ గోళ్ల అనూష అధ్యక్షతన ఈ నెల 21న స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో జరుగుతుందని ఎంపీడీఓ ఆనంద్‌బాబు తెలిపారు. ప్రజాప్రతినిధులు, అన్ని శాఖల అధికారులు హాజరు కావాలని కోరారు.

అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన



గొల్లపల్లి జెడ్పీ హైస్కూల్‌లో మంటలను ఆర్పడాన్ని చూపిస్తున్న ఫైర్ ఆఫీసర్, సిబ్బంది

నూజివీడు: అగ్ని ప్రమాదాలు జరుగకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, జరిగినప్పుడు చేపట్టాల్సిన చర్యలపై విద్యార్థి దశ నుంచే అవగాహన కలిగి ఉండాలని నూజివీడు ఫైర్ అధికారి డి.మత్తయ్య అన్నారు. జాతీయ అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా మండలంలోని గొల్లపల్లి జెడ్పీ హైస్కూల్‌లో గురువారం విద్యార్థులకు, ఉపాధ్యాయులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఫైర్ సిబ్బంది ప్రదర్శించిన పలు అంశాలను విద్యార్థులు ఆసక్తిగా వీక్షించారు. ఫైర్ అధికారి మత్తయ్య మాట్లాడుతూ చిన్నచిన్న పొరపాట్ల వల్ల అగ్ని ప్రమాదాలు సంభవిస్తాయన్నారు. వేసవిలో ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు. పాఠశాల హెచ్‌ఎం పొట్లూరి రాధికారాణి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

● **మైలవరం:** అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా మైలవరం లిటిల్ ఫ్లవర్ పాఠశాల, జూనియర్ కళాశాల, ఎస్ఎస్‌కే పాఠశాలలో గురువారం డెమో కార్యక్రమం నిర్వహించారు. అగ్నిమాపక సిబ్బంది వద్ద ఉన్న పరికరాలను ఉపయోగించి ఏ విధంగా ప్రమాదాలు నివారించవచ్చో ప్రయోగాత్మకంగా చేసి చూపించారు. అగ్నిమాపక అధికారి ఎం. గౌతమ్, ఫైర్ సిబ్బంది, ఎస్ఎస్‌కే స్కూల్ ఉపాధ్యాయులు, లిటిల్ ఫ్లవర్ స్కూల్ ప్రిన్సిపాల్ సిస్టర్ మార్గరెట్ పాల్గొన్నారు.

ఘనంగా ప్రభుత్వ డిగ్రీ కళాశాల వార్షికోత్సవం



మాట్లాడుతున్న డాక్టర్ హనిమిరెడ్డి

మైలవరం: మైలవరం మండల పరిసర గ్రామాల్లోని పేదలకు విద్యను చేరువ చేసేందుకే ప్రభుత్వ డిగ్రీ కళాశాల నిర్మించామని ప్రవాసాంధ్రులు డాక్టర్ లకిరెడ్డి హనిమిరెడ్డి అన్నారు. మైలవరం డాక్టర్ లకిరెడ్డి హనిమిరెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాల 17వ వార్షికోత్సవం గురువారం కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఇళ్ల రవి అధ్యక్షతన ఘనంగా జరిగింది. ఆయన మాట్లాడుతూ చదువు అనే మూడు అక్షరాలను నమ్ముకుని వివిధ రంగాల్లో స్థిరపడాలని విద్యార్థులకు సూచించారు. కళాశాల సీపీడీసీ సభ్యులు జి. శ్రీనివాసరెడ్డి, జి. సాంబశివారెడ్డి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థులకు సర్టిఫికెట్ల ప్రదానం

కళాశాలలో వివిధ సబ్జెక్టులలో వందకు వంద మార్కులు సాధించిన విద్యార్థులకు బంగారు పతకంతో పాటు ప్రశంసాపత్రాలను అందజేశారు. బెస్ట్ అవుట్ గోయింగ్ స్టూడెంట్ జి.శ్యామ్, బెస్ట్ కాలేజీ ఆర్టిస్ట్ ఆర్. ఆంజనేయులుకు ప్రత్యేక మెమెంటోలు, సర్టిఫికెట్ల ప్రదానం చేశారు. క్రీడల్లో విశేష ప్రతిభ కనబర్చిన 25 మంది విద్యార్థులకు బంగారు పతకం, ప్రశంసాపత్రం అందజేశారు. కార్యక్రమాన్ని కల్చరల్ కో-ఆర్డినేటర్ డాక్టర్ మెండా దేవానంద్ కుమార్ పర్యవేక్షించారు.

దీర్ఘకాలిక భూ సమస్యపై జాయింట్ సర్వే



రమణక్కపేటలో జాయింట్ సర్వే నిర్వహిస్తున్న అధికారులు

ముసునూరు: దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న భూ సమస్యపై రెవెన్యూ, అటవీ శాఖాధికారులు ఎట్టకేలకు జాయింట్ సర్వే నిర్వహించారు. రమణక్కపేటకు చెందిన కట్టా లక్ష్మికి అడవి సమీపంలో 1.86 ఎకరాల పట్టా భూమి ఉంది. ఆ భూమిని రిజిస్ట్రేషన్ చేయించేందుకు ప్రయత్నించగా సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ ఆన్‌లైన్‌లో అటవీ భూమిగా కనిపించడంతో నిరాకరించారు. కాగా యజమాని ఈ సమస్య పరిష్కారానికి ఉన్నతాధికారులను ఆశ్రయించారు. ఉన్నతాధికారుల ఆదేశాలతో గురువారం తహసీల్దార్ కె.రాజ్‌కుమార్, అటవీ శాఖ నూజివీడు డెప్యూటీ రేంజర్ అరుణ కుమారి ఆధ్వర్యంలో రెవెన్యూ, అటవీ శాఖాధికారులు రికార్డులను పరిశీలించి జాయింట్ సర్వే నిర్వహించారు. తదుపరి చర్యల నిమిత్తం ఉన్నతాధికారులకు నివేదిక పంపనున్నట్లు తహసీల్దార్ తెలిపారు. కార్యక్రమంలో సర్వేయర్లు, రైతులు పాల్గొన్నారు.